క్లుప్తంగా

చట్టాలపై శిక్షణ



పారా లీగల్ వలంటీర్లకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరాముడు

నందికొట్కూరు: పారా లీగల్ వలంటీర్లకు చట్టాలపై అవగాహన ఎంతో అవసరమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరాముడు అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో పారా లీగల్ వలంటీర్లకు చట్టాలపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పారా లీగల్ వలంటీర్లు ప్రజలకు చట్టాల గురించి తెలియజేయాలన్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటరమణ, న్యాయవాదులు మద్దయ్య పాల్గొన్నారు.

విగ్రహాలకు ప్రత్యేక పూజలు



ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు జలాభిషేకం చేస్తున్న భక్తులు

పాములపాడు: మండల కేంద్రం పొలిమేరలో ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా నూతన విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఇందులో భాగంగా శనివారం ప్రతిష్ఠిత విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, రక్షాబంధనం, రుత్విగ్వరణం, నంది పూజ, యాగశాల ప్రవేశం, ప్రధాన కలశ స్థాపన, నవగ్రహ వాస్తు, మండల ఆరాధన, యంత్రాభిషేకం, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం, వేద ఆశీర్వచనం పూజలు చేపట్టారు. రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం వేదయుక్తంగా జరిపించారు. కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఉద్యోగులకు సన్మానం



వీఆర్వోలను సన్మానిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

కొత్తపల్లి: గ్రామ రెవెన్యూ అధికారులుగా పని చేస్తూ పదోన్నతి పొందిన ఇద్దరు ఉద్యోగులను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఉమారాణి, సిబ్బందితో కలసి శనివారం సన్మానించారు. తహసీల్దార్ మాట్లాడుతూ శివపురం గ్రామ వీఆర్వో బాబుమియా ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా, గుమ్మడాపురం వీఆర్వో మౌలాలిని ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతులు పొందారన్నారు. విధుల పట్ల నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పార్కు ప్రారంభం



జిల్లా రిజిస్ట్రార్ జానకీదేవికి స్వాగతం పలుకుతున్న టీ అండ్ టీ సభ్యులు, సబ్ రిజిస్ట్రార్ కరీం

ఆత్మకూరు/ ఆత్మకూరురూరల్: పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పార్కును శనివారం జిల్లా రిజిస్ట్రార్ జానకీదేవి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పార్కింగ్ ఏర్పాటు చేయడం వల్ల రిజిస్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు కూర్చోవడానికి ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. చెట్లు ఎక్కువగా ఉండడం వల్ల చల్లని వాతావరణం ఉంటుందన్నారు. దీనికితోడు మూత్రశాలలు మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. అంతకముందు జిల్లా సబ్ రిజిస్ట్రార్‌ను స్థానిక సబ్ రిజిస్ట్రార్ కరీం సమక్షంలో టీ అండ్ టీ బిల్డర్స్ అధినేత డి.జాబీర్‌హుసేన్, టీ అండ్‌టీ టీం సభ్యులు పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. శనివారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై తిరుపూరుకు చెందిన గోదా నాగమణి వారు భక్తిరంజని, శ్రీశైలానికి చెందిన నటరాజ నృత్య కళాశాల వారు సంప్రదాయ నృత్యప్రదర్శన, అలాగే హైదరాబాద్‌కు చెందిన సాయి మ్యూజిక్ అకాడమీ వారు ప్రదర్శించిన వీణ వాదం కార్యక్రమాలు నిర్వహించారు.

నంద్యాలకు తిరుగుపయనమైన పెళ్లిపెద్దలు

మహానంది: మహానందీశ్వరుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా పెళ్లి పెద్దలుగా వచ్చిన నంద్యాల బ్రహ్మానందీశ్వరస్వామి ఆలయంలో కొలువైన పార్వతీ సమేత బ్రహ్మనందీశ్వరస్వామి వార్లు ఉత్సవాలు పూర్తయిన నేపథ్యంలో శనివారం తిరిగి నంద్యాలకు బయలుదేరి వెళ్లారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు శాంతారాంభట్, అర్చకులు స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అంతకు ముందు రుద్రగుండం కోనేరులో చక్రస్నానం అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలకంరించారు. మేళతాళాల మధ్య గ్రామోత్సవంగా నంద్యాలకు తరలివెళ్లారు. పూజల్లో ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం చిన్నా, బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయ అర్చకులు సురేష్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.



నంద్యాలకు వెళ్తున్న పార్వతీ, బ్రహ్మనందీశ్వరస్వామి

బాపట్ల జిల్లా వృషభాల జయకేతనం

మహానందిలో శనివారం నిర్వహించిన ఒంగోలు జాతి న్యూ కేటగిరీ విభాగం బండలాగుడు పోటీల్లో బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన తేజశ్రీ రెడ్డి వృషభాలు మొదటి స్థానం కైవసం చేసుకున్నాయి. రెండో స్థానంలో పెద్దకొట్టాలకు చెందిన కేశవరెడ్డి ఎద్దులు నిలిచాయి. ఎద్దుల యజమానులకు రూ.60వేలు, రూ.50వేలు నగదు బహుమతులు అందించారు. మూడో స్థానంలో గుంటూరు జిల్లా పెదకాకాని మండలానికి చెందిన తోట శ్రీనివాసరావు, కొత్తపల్లికి చెందిన వెంకట హారిక వృషభాలు నాలుగో స్థానంలో నిలిచాయి ఇదిలా ఉండగా ఈ ఏడాది మహానందిలో నిర్వహించిన ఒంగోలు జాతి ఎద్దుల పోటీలకు స్పందన అంతగా లభించలేదు. శుక్రవారం జరిగిన పాలపండ్ల విభాగంలో కేవలం మూడు జతల ఎద్దులు మాత్రమే రావడం రైతులకు నిరుత్సాహం కలిగించింది. సరైన ప్రచారం లేకపోవడంతోనే స్పందన పెద్దగా రాలేదని పలువురు చర్చించుకున్నారు.



మహానందిలో వీకెండ్ సందడి

కోనేరులో స్నానమాచరిస్తున్న భక్తులు

మహానందిలో శనివారం వీకెండ్ కావడంతో భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు స్థానిక రెండు చిన్న కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని, పూజలు చేసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి నెలకొంది. రాత్రి కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు ఏకాంతసేవ పూజలు నిర్వహించారు.

హోమాగ్నిలో 'నంది' ఆకారం



హోమంలో కనిపించిన నంది ఆకారంలోని మంటలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా మహానందిలోని యాగశాలలో శనివారం మహాపూర్ణాహుతి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ ఫొటోగ్రాఫర్ తీసిన ఫొటోలో హోమాగ్ని నంది ఆకారాన్ని తలపించింది. విషయం తెలుసుకున్న భక్తులు ఫొటోను ఆసక్తిగా తిలకించారు. –మహానంది

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



పాములపాడులోని పరీక్ష కేంద్రానికి అరగంట ముందే చేరుకున్న విద్యార్థులు



మిడుతూరులోని పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

నందికొట్కూరు: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 521 మంది విద్యార్థులకు గాను 506 మంది హాజరు కాగ 15 మంది గైర్హాజరయ్యారు. నంది జూనియర్ కళాశాలలో 415 మంది గాను 379 మంది హాజరయ్యారు. విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో 441 మంది విద్యార్థులకు గాను 434 మంది హాజరయ్యారని ఆయా సెంటర్ల డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు తెలిపారు.

- **జూపాడుబంగ్లా:** ఇంటర్ ఫస్టియర్ వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభం కాగా ఓ విద్యార్థి గైర్హాజరైనట్లు పరీక్షా కేంద్రం చీఫ్ రమేష్, డిపార్టుమెంటల్ అధికారి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. పరీక్షలకు 198 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా 197 మంది హాజరైనట్లు తెలిపారు. సోమవారం సెకండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.
- **పాములపాడు:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు పరీక్ష నిర్వహించినట్లు చీఫ్ ఎగ్జామినర్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ మోడల్ కాలేజ్, కేజీబీవీలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. కాగా 193 మందికి గాను 4 విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.
- **మిడుతూరు:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షల్లో భాగంగా తెలుగు పరీక్షకు 213 మందికి గాను ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి ఎల్లన్న, డీఓ రామమూర్తి తెలిపారు. వారు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్షా కేంద్రంలో కస్తూర్బా విద్యాలయం, ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పరీక్ష రాస్తున్నారని చెప్పారు.

ప్రశాంతంగా పరీక్షలు..



పరీక్షా కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్‌ను చూసుకుంటున్న విద్యార్థులు

ఆత్మకూరు: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తొలిరోజు 54 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 285 మంది విద్యార్థులకు గానూ 279 మంది హాజరుకాగా, ఆరు మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆదిత్య జూనియర్ కళాశాలలో 349 మందికి గాను 309 మంది హాజరు కాగా, 40 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. థెరిస్సా జూనియర్ కళాశాలలో 8 మంది గైర్హాజరయ్యారు. మొదటిరోజు మూడు కళాశాలల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

బండిఆత్మకూరులో 279 మంది హాజరు

బండి ఆత్మకూరు: మొదటి రోజున నిర్వహించిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 239 మంది జనరల్ విద్యార్థులకు గానూ 233 మంది, 49 ఒకేషనల్ విద్యార్థులకు గానూ 46 మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ వెంకట నారాయణ తెలిపారు. డీఈసీ మెంబర్స్ కృష్ణయ్య, ప్రభాకర్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి సీసీ కెమెరాల పనితీరును, విద్యార్థుల పరీక్షా విధానాన్ని పరిశీలించారు.

విద్యార్థినులతో మాట్లాడిన ఎంపీ శబరి

వెలుగోడు: నంద్యాల పార్లమెంటు సభ్యురాలు శబరి వెలుగోడు మోడల్ స్కూల్ ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థినులతో సెల్ ఫోన్‌లో మాట్లాడి.. పరీక్షల గురించి వాకబ్ చేశారు. తొలిరోజు పరీక్ష ఎలా రాశారు?, అలాగే మిగతా పరీక్షలను కూడా ఎలాంటి భయాందోళన చెందకుండా, ప్రశాంతంగా రాయాలని, పరీక్షలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తెలియజేశారు.

పింఛన్ల పంపిణీ



లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ గోపికృష్ణ, సర్పంచ్ వంగల లక్ష్మీదేవి



నెహ్రూనగర్‌లో పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు: పట్టణ, మండల పరిధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం శనివారం అధికారులు నిర్వహించారు. పట్టణంలో 4,850 మందికి గాను 4,658 మందికి 96.04 శాతం వరకు పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బేబి తెలిపారు. అలాగే మండలంలోని 5,091 మందికి గాను 4,764 మందికి పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ తెలిపారు. మండల పరిధిలోని 12 పంచాయతీలకు సంబంధించి 329 మందికి ఇవ్వాల్సి ఉందన్నారు. 93.14 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు చెప్పారు.

- **పాములపాడు:** మండలంలో శనివారం 94 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 5,691 పింఛన్ల గాను 5,305 మందికి పంపిణీ చేశామని చెప్పారు. మండలంలోని జూటూరు, కృష్ణరావుపేట, తుమ్మలూరు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ పరిశీలించారు.
- **కొత్తపల్లి:** మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ 90.73 శాతం పూర్తయిందని ఎంపీడీఓ మేరి శనివారం తెలిపారు. మండలంలో 12 గ్రామ పంచాయతీల్లో సుమారు 4,153 మంది లబ్ధిదారులుండగా 3,768 మందికి పింఛన్ అందజేశామన్నారు. 90.73 శాతం పింఛన్ పంపిణీ పూర్తి అయిందని వెల్లడించారు.
- **జూపాడుబంగ్లా:** మార్చి నెలకు సంబంధించి మండలానికి 4,921 పింఛన్లు మంజూరు కాగా గత నెలకంటే 18 పింఛన్లు తగ్గాయి. శనివారం ఉదయం ఏడు గంటల నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లో పింఛన్ల పంపిణీ ప్రారంభం కాగా సాయంత్రం ఆరు గంటలకు 4,645 పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన 276 పింఛన్లు సోమవారం పంపిణీ చేసి వందశాతం పంపిణీ పూర్తిచేయనున్నట్లు ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. మండలం వ్యాప్తంగా 10 మంది లబ్ధిదారులు మృతిచెందగా వారిస్థానంలో అర్హులైన కుటుంబసభ్యులకు పింఛన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. వాటిని ఎంపీడీఓ గోపికృష్ణ, తాటిపాడు సర్పంచ్ వంగలలక్ష్మీదేవి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.
- **పగిడ్యాల:** మండలంలోని నెహ్రూనగర్‌లో శనివారం జరిగిన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేశారు. అనంతరం స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన పలువురు కాలనీవాసులు నీటి సమస్యతో అల్లాడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, ఎంపీడీఓ సుమిత్రమ్మను ఆదేశించారు.

కేసు నమోదు

కొత్తపల్లి: ఓ యువకుడిని మరో యువకుడు కులం పేరుతో దూషించి, దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.కేశవ శనివారం తెలిపారు. వివరాలు.. మండలంలోని పెద్దగుమ్మడాపురం గ్రామానికి చెందిన ఆటో శీను మినుము చేను వద్ద అదే గ్రామానికి చెందిన కొండం అశోక్ గత నెల 18న మేకలు మేపుకుంటున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన జడ్డు వెంకటేశ్వర రెడ్డి అక్కడికి వచ్చి కోపంతో ఈ పొలంలో మేకలు మేపవద్దని సూచించాడు. ఈ విషయంపై అశోక్, వెంకటేశ్వర రెడ్డి మధ్య వాదన జరిగింది. మాటా మాట పెరిగి వెంకటేశ్వర రెడ్డి అశోక్‌ను కులం పేరుతో తిట్టి, దాడి చేశాడు. అశోక్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

నేటి నుంచి యథావిధిగా ఆర్జిత సేవలు

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 24వ తేదీ నుంచి శనివారం వరకు మహానందీశ్వరస్వామి ఆర్జిత సేవలు, గర్భాలయ ప్రవేశం నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆదివారం నుంచి యథావిధిగా ఆర్జితసేవలు కొనసాగుతాయని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. భక్తులు నేటి నుంచి అభిషేకం, కుంకుమార్చన పూజలు చేసుకోవచ్చన్నారు.

అమరవీరులకు నివాళి

కొత్తపల్లి: ఎస్సీ వర్గీకరణ సాధనలో అసువులు బాసిన మాదిగ అమరవీరులను మాదిగ జాతి మర్చిపోదని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా సీనియర్ నాయకుడు కొండే పోగు నాగరాజు, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు కనక నాగన్న అన్నారు. శనివారం స్థానిక ఎస్సీ కాలనీలో, పోలీసు స్టేషన్ దగ్గరున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాదిగ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ముందుగా అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కనుక మాసుమయ్య, చాట్ల సుజ్ఞానం, కొండం అశోక్, బాలచంద్రుడు పాల్గొన్నారు.

నకిలీ నోట్ల వ్యవహారంపై ఎఫ్‌ఐఆర్ నమోదు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో గత రెండు రోజుల క్రితం చోటుచేసుకున్న నకిలీనోట్ల వ్యవహారంపై శ్రీశైలం ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాద రావు తెలిపారు. శుక్రవారం శ్రీశైల దేవస్థాన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మధుసూదన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నకిలీనోట్ల విషయంపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి, విచారణ జరిపిస్తున్నామని వెల్లడించారు.

జూన్‌లోపు గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి

- నియోజకవర్గంలో 4,810కి గాను 2,814 ఇళ్లు పూర్తి
- డీఈ నాగరాజు



తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌తో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ నాగరాజు, ఏఈ జ్యోతి

జూపాడుబంగ్లా: గత ప్రభుత్వంలో పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు ఈ ఏడాది జూన్‌లోగా గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈ నాగరాజు తెలిపారు. శనివారం ఆయన తహసీల్దార్‌తో మాట్లాడి లబ్ధిదారులకు కుల ధృవీకరణ పత్రాలతోపాటు పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం డీఈ స్థానిక హౌసింగ్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గానికి 4,810 పక్కా గృహాలు మంజూరు కాగా 2,814 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన 1,996 గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు నిర్మించుకొంటున్న పక్కాగృహాల మొత్తాన్ని రూ.1.80 లక్షలకు తోడు మరింత మొత్తం పెంచే అవకాశాలున్నాయన్నారు. సొంత స్థలాలు కలిగిన లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకొనేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. హౌసింగ్ ఏఈ జ్యోతి ఉన్నారు.

రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలి



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాలకు భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఈఓ ఎం.శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు ఉగాది మహోత్సవాలు జరగనున్నాయి. మహోత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై శనివారం దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో దేవస్థాన అన్ని విభాగాల అధికారులు, అర్చకులు, వేదపండితులతో ప్రత్యేక సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని, ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే స్వామిఅమ్మవార్ల కైంకర్యాలు, కాలిబాట మార్గములో ఏర్పాట్లు, మంచినీటి సరఫరా, క్యూలైన్లలో ఏర్పాట్లు, తాత్కాలిక వసతి, స్వచ్ఛంద సేవకుల సహకారం, విద్యుద్దీకరణ, వైద్య ఆరోగ్య సేవలు, పారిశుద్ధ్యం, సూచికబోర్డులు, పుష్పాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, సమాచార కేంద్రాల ఏర్పాటు తదితర విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు.

మైనర్లకు వాహనాలిస్తే కేసులు



రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నందికొట్కూరు: మైనర్ బాలలకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై క్రిమినల్ కేసులు తప్పవని టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఈగిల్ క్లబ్ ఆధ్వర్యంలో నార్కోటిక్ డ్రగ్స్, రోడ్డు భద్రతపై టౌన్ సీఐ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని కోరారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవీంద్రనాథరెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి ఖాజా హుసేన్, ఏసీ కో ఆర్డినేటర్ పరిమళాదేవి, అధ్యాపకులు అన్వర్ హుసేన్ పాల్గొన్నారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు..

నూతన మోటారు వాహన చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ తిరుపాలు హెచ్చరించారు. శనివారం మండలంలోని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ ఎదుట కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై వాహనాదారులకు ఎస్‌ఐ అవగాహన కల్పించారు.

- **కొత్తపల్లి:** వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించకుంటే భారీ జరిమానాలు తప్పవని ఎస్‌ఐ ఎం.కేశవ హెచ్చరించారు. శనివారం రాత్రి మండలంలోని దుద్యాల గ్రామంలో రహదారి భద్రత నియమాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులకు కొత్త చట్టాలు అమలు కాబోతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే రూ.వెయ్యి, లైసెన్స్ లేకుండా నడిపితే రూ.10వేలు జరిమానా విధిస్తామన్నారు.

అర్జీలకు పక్షంలోపు పరిష్కారం చూపాలి



కురువలకు పొజిషన్ సర్టిఫికెట్ జారీ చేయాలని తహసీల్దార్‌కు సూచిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

పగిడ్యాల: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదైన అర్జీలకు పదిహేను రోజుల్లో పరిష్కారం చూపాలని, చూపని పక్షంలో కారణాన్ని రాతపూర్వకంగా ఇవ్వాల్సి ఉంటుందని ఎమ్మెల్యే జయసూర్య అధికారులకు ఆదేశించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై వినతులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి సమీపిస్తున్నందున ఎక్కడా కూడా నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమమే కాకుండా ప్రతి శనివారం ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. సంకిరేణిపల్లెలో అంగన్‌వాడీ కేంద్రానికి, ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్థలాన్ని కేటాయించేలా పంచాయతీ తీర్మాణం ఇవ్వడంపై ఎమ్మెల్యే ఆక్షేపించారు. ప్రొసీజర్ ప్రకారం నడుచుకోవాలని గ్రామ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. అలాగే పడమర ప్రాతకోటలో కురువ కమ్యూనిటీకి కేటాయించిన స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని తహసీల్దార్ శివరాముడును ఆదేశించారు. ఎంపీడీఓ సుమిత్రమ్మ, తహసీల్దార్ శివరాముడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎవరికీ మేలు చేయని బడ్జెట్



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలవరికీ లబ్ధి చేకూర్చేవిధంగా లేదని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్, ఎ.సురేంద్ర, షేక్ ఇస్మాయిల్, వీరన్న అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బడ్జెట్ సాధారణ ప్రజానీకం ఆకాంక్షలను, వాస్తవికతను ప్రతిబింబించేలా లేదన్నారు. బడ్జెట్ రూ.3.22 లక్షల కోట్లతో ప్రతిపాదించిన ఆదాయ వనరులు ఎలా పొందుతారనే అంశాలపై స్పష్టత లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు కేటాయింపులు ఎక్కడా లేవని, సూపర్ సిక్స్ అంటూ ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు. తల్లికి వందనం, నిరుద్యోగభృతి, రైతుభరోసా, మహిళలకు ఉచిత బస్సు తదితర వాటికి కేటాయింపులు లబ్ధిదారుల సంఖ్యకు తగ్గట్టుగా లేవన్నారు.